ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 23 సంచిక : 3 నవంబర్ 2017

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-10-1984, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈశ్వరుడు మనం నోటితో మాట్లాడే మాటలు చూడడు, చేతులతో చేసే పనులు చూడడు. మంచిపనులు చెయ్యటం మంచిదే, ఈశ్వరానుగ్రహం కేవలం మన హృదయాన్నిబట్టి వస్తుంది. మన హృదయాన్ని చూస్తాడు ఈశ్వరుడు. చేతలు మంచివి మంచిదే, మాటలు మంచివి మంచిదే, కానీ మన హృదయాన్ని చూసే ఆయన అనుగ్రహాన్ని పంపిస్తాడు. ఆయన అనుగ్రహం లేకుండా ఆయనని తెలుసుకోలేము. ఒకే మనిషికి రెండు ఉండటం కష్టం. కొంతమందికి మంచితనం ఉంటుంది కానీ తెలివితేటలు ఉండవు, కొంతమందికి తెలివితేటలు ఉంటాయి కాని మంచితనం ఉండదు. ఒకటి ఉంటే ఒకటి కలసిరాదు. కొంతమందికి రెండూ ఉంటాయి. రెండూ ఉన్న వాళ్ళే ఆత్మని దర్శించగలరు, పూర్ణత్వ స్థితిని పొందగలరు.

ఈ రమణ కేంద్రం నీడ కోసం ఏర్పాటుచెయ్యటం కానీ, కోటి రూపాయలు ఖర్చు పెట్టి ఈ రమణ కేంద్రం కట్టి నా చేతిలో పెడితే, మీరేదో పిల్లలు ఆడుకునే లక్కపిడత తీసుకొచ్చి నా చేతిలో పెట్టారనుకోండి దానికి నాకేమైనా సంతోషం వస్తుందా? మీరు కోటి రూపాయలు పెట్టి ఆశ్రమం కట్టినా నాకంతే సంతోషం వస్తుంది. ఊరికే నీడ కోసం ఆశ్రమం కానీ, దీనికింకో పర్పస్ లేదు. ఇది కేవలం నీడ కోసం. అయితే ఒక హాలు కింద కడితే, ఎవరైనా పెళ్ళిళ్ళు చేసుకోవటానికి కూడా ఉపయోగపడుతుంది. హాలు లేదు జిన్నూరులో. పాలకొల్లులోనో, దేవుడి హాలులోనో అక్కడా చేసుకుంటున్నారు. ఖాళీగా ఉంటే ఎవరైనా పెళ్ళిళ్ళు చేసుకోవచ్చు, పబ్లిక్ పర్పస్‌కీ ఉపయోగించవచ్చు. రమణ కేంద్రం కంటే మీ హృదయాలు నాకు ముఖ్యం. మీరు బాగుపడటం నాకు

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

14-10-1984
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

ముఖ్యం. చీమతలకాయంత కూడా ఆ కేంద్రం మీద నాకు అపేక్ష లేదు. కడితే అభ్యంతరం లేదు. కానీ మీరు బాగుపడటం ముఖ్యం. మీ హృదయాలు సంస్కరింపబడటం ముఖ్యం. ఎందుచేతనంటే, మీకంటే ఈ సిమ్మెంటు, ఈ ఇటుకలు ఎక్కువని నేను అనుకోవటం లేదు. ప్రాణం ఉన్న మనుషుల కంటే, ప్రాణం లేని రూపాయలు ఎక్కువని నేను అనుకోవటం లేదు. ఒక విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి, ఎవరి దగ్గరైనా స్థలం కొంటామనుకోండి, ఉదాహరణకి, ఈ పదిరూపాయలు తగ్గించండి, అని బేరం ఆడతాం. ఎవరిదైనా ఒక ఎకరం పొలం కొంటామనుకోండి, ఇంత ఎక్కువ ఇస్తాము లేకపోతే ఇంత తగ్గిస్తాం ఈ రేటుకి ఇవ్వండి, లేకపోతే బజారులో బట్టలు కొంటే ఈ నాలుగు రూపాయలు తగ్గించి ఇవ్వండి, ఇలా ఏదో బేరం ఆడతాం. మాటలో కూడా ఏదైనా వస్తువు కొనేటప్పుడు, ఇచ్చేటప్పుడు ఎదుటివారి దగ్గర పుచ్చుకొనేటప్పుడు మనకు లౌకికంగా వ్యాపార మనస్తత్వం ఉంటుంది, లౌకికదృష్టి ఉంటుంది, మీ ఇంటికొస్తే మమ్మల్ని గౌరవించారు కాబట్టి, మీరు మా ఇంటికొస్తే మిమ్మల్ని గౌరవిస్తాము. ఇవన్నీ కేవలం లౌకిక వ్యాపారం. సోదరమహాశయులారా, ఇదంతా ఎందుకు చెప్పతున్నానంటే, దేవుడి దగ్గర వ్యాపార మనస్తత్వం కుదరనే కుదరదు. నేను నీకింత పూజ చేస్తాను, ఇన్ని సార్లు పూజ చేస్తాను, లేకపోతే ఇన్నిసార్లు కాశీ వెళ్ళివచ్చాను, ఇన్నిసార్లు అరుణాచలం వెళ్ళివచ్చానే, నీపేరు మీద ఇన్ని దానాలు చేసానే, నాకు మోక్షం ఇవ్వవా? అని అడగటానికి అవకాశం లేదు. మీ డబ్బు మీకు ముట్టచెప్పేసాను కాబట్టి నా ఎకరం పొలం నాకు రిజిస్టర్ చేసి ఇవ్వటానికి మీకు అభ్యంతరం ఏమిటీ, ఎందుకు ఇవ్వవు, అని అడుగుతాం. అలా భగవంతుడిని అడగటానికి అవకాశం లేదు, నన్ను క్షమించండి, మీరు మంచి పనులు చెయ్యొచ్చు, కానీ నేను ఇన్నిసార్లు పూజ చేసాను, ఇన్నిసార్లు నీ నామం స్మరించాను, అందుచేత నువ్వు నాకు మోక్షం ఇవ్వాలి అని భగవంతుడిని అడిగే అవకాశం అక్కడ లేదు. ఎందుచేతనంటే మీరు దానం చేసినా, ఒకమంచిపని చేసినా మీ హృదయంలోని స్పిరిట్‌ని చూస్తాడు. భగవంతుడు మీ హృదయాన్ని చూస్తాడు, మీరు ఈశ్వరుడిని బలవంతం చెయ్యటానికి అవకాశం లేదు. మామూలు బేరాలలో యజమానిని బలవంతం చెయ్యొచ్చు. ఏవండీ ఈ 50 తక్కువ పుచ్చుకొని నాకు వస్తువు ఎందుకు ఇవ్వకూడదని, అలా ఈశ్వరుడిని మట్టుకు బలవంతం చెయ్యటానికి ఏమీ అవకాశం లేదు. నేను ఇంత కష్టపడ్డానుకదా! ఇన్నిసార్లు స్నానాలు చేస్తున్నాను, ఇన్నిసార్లు పూజలు చేస్తున్నాను, ఇన్ని పువ్వులు ఖర్చుపెట్టాను నీకోసం, ఎన్ని పువ్వులు కోసానో, ఎంత చేసానో, ఎన్నిసార్లు రామాయణం చదివానో, ఎన్నిసార్లు భాగవతం చదివానో, ఎన్నిసార్లు నీ నామం చేసానో, మరి నాకు మోక్షం ఇవ్వవా అని అడగటానికి అవకాశం లేదు. ఆయనకి ఇష్టం అయితే ఇస్తాడు లేకపోతే లేదు. అసలు అడిగే సమస్య లేదు. అయితే మనస్సు పవిత్రం అయ్యేకొలదీ, ఏకాగ్రం అయ్యేకొలదీ ఆయన అనుగ్రహం దానంతట అదే వచ్చేస్తుంది. మీరు

అడగనక్కర లేదు. అడగటం అనే సమస్య పెట్టుకోవద్దు మనం లౌకికదృష్టి తో చేసే బేరసారాలకు భగవంతుడు అతీతుడు.

ఆధ్యాత్మికరంగంలో చాలామందికి పొరపాటు అభిప్రాయాలు వస్తున్నాయి. స్పష్టత తక్కువగా ఉంటోంది. అయితే ఈ విషయం స్పష్టమైనది, సరళమైనది, సూటి అయినది. కన్ఫ్యూజన్ స్టేట్ కానేకాదిది. ఇప్పుడు మీకు ఈ శరీరము అనే భావన ఎంత స్పష్టంగా ఉందో అంత స్పష్టంగా మీకు ఆత్మస్థితి వచ్చాక తెలుస్తుంది. అంత స్పష్టంగానే కనిపిస్తుంది. ఇది ఊహించేది అని మీరు అనుకోవద్దు, ఇది స్పష్టమైన స్టేట్. చాలామంది ఆధ్యాత్మిక రంగంలో అభివృద్ధిలోనికి రాలేకపోవటానికి భయం కారణం. స్వామి వివేకానంద కూడా చెప్పతాడు, ఇట్ ఈజ్ ఫియర్ దట్ బ్రింగ్స్ అజ్ డెత్, ఇట్ ఈజ్ ఫియర్ దట్ అజ్ వీక్‌నెస్, ఇట్ ఈజ్ ఫియర్ దట్ బ్రింగ్స్ అజ్ మిజరీ. మనకి దుఃఖం వచ్చినా, చావు వచ్చినా,ఏదైనా విషాదం వచ్చినా, వీటన్నిటికీ భయం కారణం. ఆధ్యాత్మికరంగంలో స్త్రీలకు కానీ పురుషులకు కానీ అభివృద్ధిలోకి రాకపోవటానికి భయం కారణం.

ఒకరన్నారు ఈ రమణ కేంద్రం మహిళా సంఘానికి బాగానే ఉంటుందని, మరి పురుషులకి బాగుండదా? పురుషులకి మోక్షం అక్కరలేదా? అప్పుడు నేను మనస్సులో అనుకొన్నాను “వాళ్ళని భగవంతుడు క్షమించి ఆశీర్వదించుగాక అని”. పురుషులకి మోక్షం అక్కరలేదా, అంటే స్త్రీలేనా బంధంలో ఉంది? పురుషులెవరూ బంధంలో లేరా? స్త్రీలకేనా దుఃఖం అంతా? పురుషులెవరికీ దుఃఖం లేదా? స్త్రీలేనా సంకుచితంగా ఉండేది? పురుషులందరూ విశాలంగా ఉన్నారా? అంటే ఏంటీ భక్తి అనేది మతం అనేది కేవలం స్త్రీలకే కానీ పురుషులకి అక్కరలేదు అనుకొనేవాళ్ళు ఉన్నారు. దేవుడు స్త్రీలకేనా పురుషులకి అక్కరలేదా? అంటే వాళ్ళు చెడ్డ సంకల్పంతోటి మాట్లాడిన మాటలు కాదు ఇవి, ఏదో వాళ్ళకి తోచింది మాట్లాడేస్తారు. ఏవండీ పురుషులకి శాంతి అక్కరలేదా? స్త్రీలకేనా శాంతి? అసలు దేవుడిని ఎందుకు తెలుసుకోవటం? మీకు శాంతి కావాలంటే, సౌఖ్యం కావాలంటే, ఆనందం కావాలంటే, దేవుడిని తెలుసుకొని తీరాలి, మరో మార్గంలేదు. మీరు హృదయ పూర్వకంగా శాంతే కావాలని మీరు అనుకొంటే, సుఖం ఆనందం కావాలనుకొంటే మీరు దేవుడిని తెలుసుకొని తీరాలి. ఇంకో మార్గాంతరం లేదిక.

మనం ఆధ్యాత్మికంగా వెనుకపడి పోవటానికి భయం కారణం. అందుచేత స్వామి వివేకానంద జనరల్‌గా ప్రతీ మీటింగ్‌లో ఏం చెప్పేవాడంటే “బి ఫియర్లెస్”. ఆయన పతాకం అది. అంటే భయం లేకుండా ఉండండి. నిర్భయంగా ఉండండి. ఏ విషయంలో మీరు భయపడకండి. బి ఫియర్లెస్. భయం లేకుండా ఉండండి. ఈ మధ్యన ఒక ఆఫీసరుగారు మా ఇంటికి వచ్చారు. బాగా చదువుకొన్నాయన, కానీ దీని గురించి అవగాహన లేదు. ఎంత

చదువుకొన్నప్పటికీ ఆధ్యాత్మిక సంస్కారం లేకపోతే వాళ్ళకి వంటపట్టదు. ఆయనేమన్నారంటే, రమణ మహర్షిగారికి కాన్సర్ వచ్చినప్పుడు మత్తుమందు పెట్టకుండా ఆపరేషన్ చేసేసారట కదా ఎంత గొప్ప విషయం! మత్తుమందు పెట్టకుండా ఆపరేషన్ చేస్తే నిజంగా ఆయన తట్టుకొంటే అది గొప్ప విషయమా! అంటే ఆయన శరీరం గురించి ఆయనకి తెలియక పోతే అది చాలా గొప్ప స్థితి అని ఆయన అనుకొంటున్నాడు. అయితే మనకి పెద్ద పెద్ద ఆపరేషన్లు చేసినప్పుడు మత్తుమందును పెడతారు. అప్పుడు మన శరీరం మనకి తెలియదు, అంటే మనందరం జ్ఞానులమా? ఎంత ఫాల్స్ దృష్టి పెట్టుకున్నారో చూడండి. రమణ మహర్షి చాలా గొప్పవాడు, ఆయన గురించి ఇంకా తెలుసుకొందామని నా దగ్గరకి వచ్చాడు. కానీ నేను ఆయన్ని మబ్బుల్లో ఉంచడం న్యాయం కాదు. కాన్సర్ వస్తే ఆపరేషన్ చెయ్యటానికి లోకల్‌గా కూడా ఆయనకేమీ ఇంజక్షన్ ఇవ్వలేదు, ఆయన శరీరం ఆయనకి తెలియలేదు అంచేత గొప్పవాడు అనుకొంటున్నాడు. అలా కాదు, ఏదో ఇంజక్షన్ చేసారు మత్తుకోసం లోకల్‌గా అని చెప్పాను. సడన్‌గా ఆయన మీద గౌరవం తగ్గిపోయింది. అంటే ఆయన శరీరం ఆయనకి తెలియకుండా ఉంటే ఆయన గొప్పవాడన్న మాట. పెద్ద చదువు చదువుకొన్నాయన అయితే వాళ్ళ తప్ప కాదది, వాళ్ళని మనం విమర్శించకూడదు. వాళ్ళ సంస్కారం అంతవరకే పర్మిట్ చేస్తోంది, వాళ్ళ బ్రెయిన్ అంత దూరమే ప్రయాణం చేస్తోంది. అంటే నా శరీరం నాకేమీ తెలియకుండా ఉంటే నేను జ్ఞానినా? మహర్షిగారి మీద గౌరవం సడన్‌గా సగం డిగ్రీలు తగ్గిపోయింది. అయితే అందరి లాగే మత్తు ఇంజక్షన్ చేసి ఆపరేషన్ చేసారన్నమాటండీ అని రెండుసార్లు అన్నారు పాపం. ఆ వచ్చినాయన సబ్జక్టు మీద ఎన్లయిటెన్ అవ్వటం నాకు ముఖ్యం కానీ, మహర్షిగారి తరఫున నేనేమీ ప్లీడరుని కాదు. మీరు బాగుపడటం ముఖ్యం. మీరు అభివృద్ధిలోనికి రావటం ముఖ్యం, మీరు వివేకవంతులుగా జీవించటం ముఖ్యం కానీ, మీ అందరిచేత రమణమహర్షిగారు చాలా గొప్పవారు అనిపించటం వలన నాకేమి కలసివస్తుంది? మీకేమి కలసివస్తుంది? ఆయనకేమన్నా కలసివస్తుందా పోనీ? మనందరం కలసి భగవాన్ చాలా గొప్పవాడు అంటే ఒక అంగుళం ఆయన పైకి వెళ్తాడా ఏమైనా? ఆయనకీ ఏమీ కలసిరాదు. మనకీ ఏమీ కలసిరాదు. మనకున్న వివేకమే మనకి కలసివస్తుంది. మనకున్న శాంతే, మనకున్న సిద్ధే, మనకున్న కాంతే మనకి కలసివస్తుంది.

ప్రతీ దానికీ భయం కారణం. భయం వల్ల మనకి తెలిసున్న విషయం కూడా మర్చిపోతాం. సోదర మహాశయులారా! నిజమైన అరుణాచలం, నిజమైన భగవంతుడు మన హృదయంలో ఆత్మగా ప్రకాశిస్తున్నాడు. నిజమైన అరుణాచలం మన హృదయంలోనే ఉంది, నిజమైన కాశీ మన హృదయంలోనే ఉంది, నిజమైన భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. ప్రత్యక్షంగా ఉన్నాడు, ప్రత్యక్ష ప్రమాణం ఆయన. ఒకసారి

రామచంద్రరాజుగారు మేము ఒంటరిగా కూర్చున్నప్పుడు మీరెవరో మాకు తెలియనివ్వటంలేదు అని నాతో అన్నారు. అంటే ఇక్కడ వస్తువు ప్రత్యక్షంగా ఉంది కదా! దీనికి పుట్టుక లేదు, చావు లేదు. ఇక్కడే మీకు దర్శనం ఇస్తుంది. ఎవరికి దర్శనం ఇస్తుంది? ఎవడి ఇంద్రియాలైతే శుద్ధి అయినవో, ఎవరి మనస్సు అయితే శుద్ధి అయిందో, ఎవడి బుద్ధి అయితే ఏకాగ్రం అయిందో, వాడికి ఈ లోకంలో ఈ దేహంలో ఈ క్షణంలో దర్శనం ఇస్తుంది. ఎవడి బుద్ధి అయితే నిర్మలమయిందో, ఎవడి మనస్సు అయితే ఏకాగ్రం అయిందో, వాడికి ఇప్పడే ఇక్కడే ఈ శరీరంలో ఉండగానే వస్తువు దర్శనం ఇస్తుంది. ఇదే మానవుడి యొక్క గమ్యం, మతాల యొక్క గమ్యం. మతాలు పుట్టటం కూడా దీనికోసమే. దీనికి అపరిమితమైనటువంటి ఓర్పు ఉండాలి. మనకి సహనభావన ఎక్కువ ఉండాలి. అపరిమితమైనటువంటి మానసికమైన శక్తి సంపాదించుకోవాలి. పట్టుదల ఉండాలి, విషయాన్ని తెలుసుకోవాలనే పట్టుదల ఉండాలి. హృదయంలో ఏమైనా దోషం ఉంటే దానిని బయటికి గెంటివెయ్యటానికి స్ట్రగుల్ ఉండాలి, వేదన ఉండాలి. లోపల ఏదైనా దోషం ఉంటే, ఆ దోషాన్ని బయటికి గెంటుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి. ఎందుచేతనంటే మీ దోషమే మిమ్మల్ని ఆత్మని దర్శించనివ్వటం లేదు కానిదేవుడు కాదు, దేవుడికి మీరంటే ఇష్టం, దేవుడు కరుణామయుడు, ప్రేమమయుడు, మీరేమైనా మంచి పనులు చేస్తుంటే మంచివాళ్ళే అడ్డు తగలరు కదా! ఇంక మీరు ఆత్మని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తుంటే దేవుడు ఎందుకు అడ్డుగా నిలబడతాడు. దేవుడు కాదండీ, మీ లోపాలు, మీ పాపాలు, మీ బలహీనతలు, మీ గుణాలు, అడ్డుగా నిలబడి ఆత్మని తెలుసుకోకుండా అడ్డు పడుతున్నాయి.

సోదరమహాశయులారా! మీరు ధ్యానం ఒక యోగం అనుకొంటున్నారు, భక్తి ఒక యోగం అనుకొంటున్నారు, కర్మ ఒక యోగం అనుకొంటున్నారు, జీవితమే ఒక యోగం! జీవితం అంతా యోగమే, ఎవడైతే జీవితమంతా యోగంగా తీసుకున్నాడో, వాడు ఈశ్వరుని దర్శిస్తాడు. ఎక్కడైనా మనకి ఒక నల్లటి త్రాచుపాము కనిపించిందనుకోండి, మనకెంతో భయం వేస్తుంది. బాగా ఆలోచించండి ఇక్కడ కూర్చున్న వారందరూ, ఒక బ్లాక్ కోబ్రా ఇప్పడు సడెన్‌గా ఇక్కడికి వచ్చిందనుకోండి, ఇక్కడ కూర్చొన్న వాళ్ళందరికీ ఎంతో భయం వేస్తుంది, ఒక్కసారి కరిస్తే చంపేటంత విషం ఉన్న త్రాచుపాము ఇక్కడికి వస్తే మనకెంత భయం వేస్తుందో, ఏదైనా పాపపు తలంపు మనలోకి వస్తే అంత భయం పుడితే, వాడు దేవుడిని దర్శిస్తాడు. మనం చుట్టాలని మర్యాద చేసినట్లు పాపపు తలంపుల్ని మర్యాద చేస్తున్నాం. ఇంక మనకు దేవుడు ఏమీ తెలుస్తాడు.

మన ఇల్లు కాలిపోతోంది అనుకోండి, హరే రామ హరే కృష్ణా అనుకొంటూ గదిలో కూర్చుంటామా? తొందరగా బయటికి పారిపోవటానికి ప్రయత్నిస్తాము, ఇల్లు కాలిపోతుంటే

హరే కృష్ణ హే భగవాన్ అంటూ కూర్చుంటాడా ఎవడైనా; సంగీతాలు వస్తాయా? తొందరగా బయటికి పోవాలి అని చూస్తాడు. మన ఇంట్లో దాచుకున్న రూపాయలని కూడా మర్చిపోతాం. మనల్ని మనం రక్షించుకోవటం కోసం బయటికి వస్తాము. ఇల్లు అంటుకొంటే ఇంటిలోనుంచి బయటికి రావటానికి ఎంత తపన పడతాడో, అలాగే తన పాపపు తలంపులలోంచి బయట పడడానికి ఎవడైతే కృషి చేస్తున్నాడో వాడు దేవుడిని దర్శిస్తాడు. ఆ ఆవేశం కానీ, ఆ ఆవేదన కానీ, ఆ అభిలాషకానీ ఎప్పుడైనా ఒక్క సెకను అయినా మీ జీవితంలో వచ్చిందా? ఆ ఎమోషనల్ స్టేట్ ఎప్పుడయినా వచ్చిందా? మీరు పూజలు చేస్తున్నారు, జపాలు చేస్తున్నారు, మంత్రాలు చేస్తున్నారు, అవన్నీ చెయ్యండి, ఎప్పుడూ గోరువెచ్చని నీళ్ళగానే ఉంటున్నాయా, వేడెక్కుతున్నాయా ఎప్పుడైనా అసలు? నీళ్ళు వేడెక్క నివ్వరా? గోరువెచ్చగానే ఉంచుతారా? సోదరమహాశయులారా! నాకు డైరెక్ట్ అప్రోచ్ కావాలి, ఎక్కడో ఉంది, ఏదో ఉంది, ఎక్కడో పరమేశ్వరుడు కూర్చుని ఈ దేశాన్ని, ప్రపంచాన్ని పరిపాలిస్తున్నాడు, అటువంటి కథలకి కొంతకాలం దూరం అవుదాము. బాహ్యదృష్టికి చర్మదృష్టికి అలవాటు పడిపోయిన మనకోసం నేను ఎక్కడో ఉన్నాను అని భగవంతుడు చెప్పతున్నాడు. కానీ నిజమైన దేవుడు మన హృదయంలోనే ఉన్నాడు. ఈ బాహ్యదృష్టికి అలవాటు పడ్డ జీవితాలకోసం, నేను వైకుంఠంలో, కైలాసంలో ఉన్నానని చెప్పతున్నాడు. కానీ నిజమైన దేవుడు మన హృదయంలోనే ఉన్నాడు. మనకోసం ఎదురు చూస్తున్నాడు, ఒక్క విషయం మీరు మర్చిపోకండి, దేవుడు మిమ్మల్ని ప్రేమిస్తున్నట్లుగా ఈ సృష్టిలో ఏ మనిషి మిమ్మల్ని ప్రేమించలేడు. మీ భర్తలు, మీ తల్లిదండ్రులందరూ మిమ్మల్ని ప్రేమిస్తున్నారు అని మీరనుకొంటున్నారు, ప్రేమిస్తున్న మాట నిజమే, దేవుడు మిమ్మల్ని ప్రేమిస్తున్న ప్రేమలో ఈ ప్రేమకోటోవంతు ఉండదు. దేవుడు ప్రేమమయుడు. మనకోసం ఎదురు చూస్తున్నాడు, మేము పూజలు చేస్తున్నాం, జపాలు చేస్తున్నాం, అని నోటితో పరుషవాక్యాలు పలుకుతూంటే ఈశ్వరుడు ఏం చేస్తాడు? నోటిలోంచి వచ్చేవన్నీ పరుషవాక్యాలు, బుద్ధిలో కుయుక్తులు, కుతంత్రాలు, కుచేష్టలు. మేము పూజలు చేస్తున్నాము అంటే ఇటువంటి వారికా క్షమించి వైకుంఠరాజ్యం ఇచ్చేది?

మీ సర్టిఫికేట్లు నాకు అక్కరలేదు, మీరు బాగుపడటం నాకు కావాలి. మీరిచ్చే ప్రశంసాపత్రాలు నాకు అక్కరలేదు, మీరు ఏ ఊళ్ళో ఉన్నా సరే, ఏ దేశంలో ఉన్నా సరే, మీరు బాగుపడటం నాకు ముఖ్యం. మా ఇంటిలో చాలా సమస్యలుగా ఉన్నాయండి, మా ఊళ్ళో అంతా గొడవలుగా ఉంది, మా ఊళ్ళో అంతా అల్లరే అని కొంతమంది చెపుతూ ఉంటారు. మీరు పేపరులో చూస్తే దేశంలో అన్నీ సమస్యలే. ఎక్కడ చూసినా ప్రోబ్లెంస్. ఇంటిలో సమస్యలు, వీధిలో సమస్యలు, ఊరిలో సమస్యలు, రాష్ట్రంలో సమస్యలు, దేశంలో సమస్యలు, ప్రపంచంలో సమస్యలు. సమస్యలేని ఇల్లు కానీ, ఊరు కానీ, దేశం కానీ, లోకం కానీ

ఎక్కడైనా ఉందా? ఫుల్ ఆఫ్ ప్రోబ్లెంస్, ఫుల్ ఆఫ్ స్ట్రగుల్స్, ఫుల్ ఆఫ్ డిఫికల్టీస్. కొంతమంది సర్ఫేస్ సపోర్ట్సుతో సంతోషపడుతూ ఉంటారు. ఏదో తినటానికి లోటు లేదు, రోజులు హాయిగా వెళ్ళిపోతున్నాయి అది ఊరికే పైకి కనిపించే సపోర్ట్, ఆ సపోర్ట్ ఎంతకాలం ఉంటుంది? మీకు తినటానికి తిండి ఉందని మీ శరీరం ఎప్పడూ ఉంటుందను కొంటున్నారా? మీకు తినటానికి తిండి ఉన్న మాట నిజమే, అయితే మీ శరీరం ఏమైనా కోటి సంవత్సరాలు ఇక్కడ ఉంటుందనుకొంటున్నారా? ఇది ఒక మాయ. మీకు బ్యాంకులో ఉన్న డబ్బు, మీ భర్తలు సంపాదించే డబ్బు, మీ గూట్లో ఉన్న డబ్బు, ఇదంతా ఊరికే జస్ట్ బయటికి సపోర్ట్‌గా కనిపిస్తోంది. అది చూసి మాయలో పడతాం. మీ కూడా వల్లకాడులోకి వస్తుందా మీరు గూటిలో దాచుకున్న డబ్బు? కనీసం వల్లకాడు దాకా అయినా సాగనంపుతుందా గూటిలో దాచిన డబ్బు? పోనీ మన కూడా రావద్దు, వల్లకాడు దాకా అయినా వస్తుందా? అయితే అంతమాత్రంచేత డబ్బుకి విలువ లేదని, తెలివితేటలకి విలువ లేదని నేను చెప్పటం లేదు. తెలివితేటలు అవసరమే, డబ్బు అవసరమే, చదువు అవసరమే. అయితే అవి రక్షించేవి కాదు, అవి ముక్తిని ఇచ్చేవి కాదు, అవి కేవలం పొట్టకోసం, ఈ దేహం నిలబడటం కోసం పనికివస్తాయి. మీరు దాచిన డబ్బు మీ గుమ్మం దాటి బయటికి వస్తుందా మీరు వెళ్ళేటప్పడు. కనీసం గుమ్మం దాటి ముందుకు వస్తుందా? మీకు తెలివితేటలు ఉంటే అభివృద్ధి చేసుకోండి, మీకు తెలివితేటలు వద్దని, డబ్బు వద్దని, నేను చెప్పటం లేదు. కానీ మీకు తెలివితేటలు ఉన్నంతమాత్రంచేత, డబ్బు ఉన్నంతమాత్రం చేత, మీకు ఈశ్వరుడు దర్శనం ఇవ్వడు. ఈ తెలివితేటలు, డబ్బు, కేవలం లౌకిక ప్రయోజనం కోసం. తెలివితేటలు ఉండటం వల్లనే కనుక భగవంతుడు దర్శనం ఇస్తే, ప్రపంచంలో ఉన్న మేధావులందరికీ ఈ పాటికి దేవుడు కనిపించి ఉండాలి. ఇది కామన్‌సెన్స్ పాయింట్. ఏ తెలివైన వాడికీ ఇంతవరకూ దేవుడు దర్శనం ఇవ్వలేదు.

అసలు చెరువులో ఈదాలంటే ముందు చెరువులో దిగాలి కదా! మనందరం ఇప్పడు గట్టు మీద కూర్చొని ఎప్పడు దిగుదాం, ఎప్పడు ఈత నేర్చుకొందాం అనుకొంటున్నాము. అసలు నీళ్ళు ముట్టుకోకుండా ఈత ఎలా వస్తుంది? చెరువులో దిగకుండా ఈత ఎలా నేర్చుకొంటాం? గట్టుమీద కూర్చొని ఈత నేర్చుకోవాలి ఈత నేర్చుకోవాలి అంటే ఈత వచ్చేస్తుందా? పోనీ చెరువులో దిగుతాం, ఈత నేర్చుకుంటాం. ఎక్కడుంది ఈ ఆత్మ రత్నం, మన హృదయంలో ఉంది. కొంతమంది ఊరికే అలా పైపైనే జీవిస్తూ వుంటారు. ఈ మధ్యన నాలుగు రూపాయలు సంపాదించాము ఏదో గౌరవంగా వెళ్ళిపోతున్నాయి రోజులు అంటారు. అంతే వాళ్ళు! అది జీవితం పట్ల సరైన అవగాహన లేకుండా పైపైన ఈదటం లాంటిది. కొంతమంది ఇలాంటి మాటలు చెపుతారు. ఏదోరోజులు

గౌరవంగా వెళ్ళిపోతున్నాయి, నలుగురిలో తలెత్తుకు తిరుగుతున్నాం అంటారు. నలుగురు ఎవరు? వీడెవడు తలెత్తుకు తిరగటానికి? ఈ గౌరవం ఎంతసేపు నిలబడుతుంది? నలుగురిలో గౌరవంగా ఉందట, అక్కడితోటి సంతృప్తి పడిపోతున్నాడు. వీళ్ళందరూ ఊరికే ఈతగాళ్ళు! కొంతమంది మునుగుతారు. మునిగితే భయం వేస్తుంది, ఇప్పుడింతకీ అదీ సమస్య ఇక్కడ. కొంత లెక్క సాధన చేసేసరికి భయం వేస్తుంది. వాళ్ళకున్న వాసనలు ఉంటాయి కదా! అవి భయం పుట్టిస్తాయి లోపలినుంచి. భయం వేసి మళ్ళీ వెనక్కి వచ్చేస్తారు. లోపల మన వాసనలు, మన సంస్కారాలు ఉంటాయి కదా! సాధన చేసి కొంత ముందుకి వెళ్ళేసరికి భయం మనకి పుడుతుంది. భయం పుట్టేసరికి మళ్ళీ వెనక్కి వచ్చేస్తాం. ఎక్కడో హృదయం యొక్క లోతులలో ఆత్మ ముత్యం ప్రకాశిస్తోంది. భయాన్ని విడిచిపెట్టి, అహంకారాన్ని విడిచిపెట్టి, ఎవడైతే లోతులకి వెళ్ళి, అట్టడుగుకి వెళ్ళి ఆ ముత్యాన్ని చేత్తో పట్టుకొంటున్నాడో వాడు జ్ఞాని కాగలడు. ఏమాత్రం పిసరంత భయం వేసినా వాడక్కడికి వెళ్ళలేడు. కొంతమంది శాంతిని అనుభవిస్తారు, కానీ మాటలతో చెప్పలేరు. శాంతి అనుభవం వాళ్ళలో ఉంటుంది కానీ మాటలతో చెప్పలేరు. రామకృష్ణ పరమహంసలాగా రమణమహర్షి లాగా ఎవరూ లేరని మీరనుకోవద్దు. ఎవరైనా మహాత్ములు ఉంటే ఉండొచ్చు. అయితే టీచింగ్ కూడా ఉంది వీళ్ళిద్దరికీ.

అసలు ఇంటిలో సమస్యలు కానీ, ఊళ్ళో సమస్యలు కానీ, దేశంలో సమస్యలు కానీ, ఒకటే కారణం, మీరు మనస్సులో దాచుకోండి. మన మనస్సులో శుద్ధి లేకపోవటం, మన ఇంద్రియాలలో శుద్ధి లేకపోవటమే ఈ ప్రపంచంలో సమస్యలన్నింటికీ కారణం. ప్రపంచంలో అన్ని రకాల ప్రోబ్లమ్స్ ఎకనామికల్ ప్రోబ్లమ్స్, పొలిటికల్ ప్రోబ్లమ్స్, సోషల్ ప్రోబ్లమ్స్, ఏ రకమైన ప్రోబ్లమ్స్ అయినా సరే, ఏ బ్రాంచ్‌లో దేనికి సంబంధించిన ప్రోబ్లం అయినా సరే, ఇంద్రియాలలో శుద్ధి లేకపోవటం వల్ల మనస్సులో శుద్ధి లేకపోవటం వల్ల, సమస్యలు సృష్టింపబడుతున్నాయి. పరిష్కరించటం మాట వదిలేయండి, అసలు సమస్య ఎందుకు పుట్టుకొస్తోంది. మన ఇంద్రియాలు నిర్మలంగా ఉంటే, మన మనస్సు పవిత్రంగా ఉంటే, అసలు సమస్యే పుట్టదు. ఇంద్రియాల ప్రకోపం వల్ల, మనస్సు యొక్క ప్రకోపం వల్ల ప్రపంచంలో ఇన్ని సమస్యలు వస్తున్నాయి. మనం అరుణాచలం వెళ్ళాలంటే పది రోజుల నుంచి సామాను సర్దుకొంటాం. కాశీ వెళ్ళాలంటే పదిరోజుల నుంచీ సామాను సర్దుకొంటాం. చావు కూడా ఒక ప్రయాణం లాంటిదే. ఎంత ముందునుంచి సర్దుకోవాలి! మళ్ళీ తిరిగివచ్చేసే దానికే మీరు ఇంత కష్టపడి సర్దుకొంటున్నారు కదా; అరుణాచలం వెళ్ళి కూర్చోరు అక్కడ. పది రోజులు ఉండి వచ్చేస్తారు. ఆ పది రోజుల కోసం ఇక్కడ పది రోజులు సర్దుకొంటున్నారు. మీ శరీరాలు పడిపోయిన తరువాత మీరు తిరిగిరారు కదా, మహా ప్రయాణం కదా అది, మరి ఆ ప్రయాణానికి

ఎంతముందు నుంచి సర్దుకోవాలి అని ఎప్పడైనా ఆలోచిస్తున్నారా మీరు ఒంటరిగా కూర్చొని? ఆ ప్రయాణానికి ఏమీ సర్దుకోరా? ఏమీ జాగ్రత్త పెట్టుకోరా? పది రోజులు ఉండి తిరిగి వచ్చేసే ప్రయాణానికి మీరు ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటున్నారు, చివరి ప్రయాణానికి మీరేమి జాగ్రత్తలు తీసుకోరా? అసలు మీ హృదయంలో ఏముందో మీకే తెలియనప్పడు వాటిని తొలగించుకోవటానికి ఎలా ప్రయత్నం చేస్తారు? మన హృదయంలో ఏముందో మనకే తెలియని స్థితిలో మనం ఉన్నప్పడు, తొలగించుకోవటానికి చేసే ప్రయత్నం ఏముంది అసలు. ముందు మన హృదయంలో ఏముందో మనకి తెలిస్తే వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యొచ్చు. అసలు ఏముందో మనకే తెలియదు కదా అసలు.

ఆత్మని తెలుసుకోవాలండీ, ఆత్మని తెలుసుకోవాలండీ అంటారు. ఇప్పడు ఎక్కడ ఉంది ఆత్మ తెలుసుకోవటానికి? ఇప్పడు మీరు ఆత్మ అయ్యి ఉన్నారు కదా! ఏంటి తెలుసుకుంటారు? మనం నోటితోటి నామం చేస్తున్నాం, నోటిలో దేవుడు కాపురం ఉంటే, మనకి మనస్సులో సైతాను కాపురం ఉన్నాడు. ఇంక ఎలా తెలుస్తాడు ఈశ్వరుడు? అసలు మీరు నోటితోటి చెప్పే మాటలకి, మీ మనస్సులో వచ్చే ఊహలకి ఏమైనా పొంతన ఉందా? ఎక్కడో దేవుడి దాక ఎందుకు మీరు నోటితోటి ఒక మాట చెప్తున్నారు అనుకోండి, మీ మనస్సులోని తలంపు, నోట్లోంచి వచ్చే మాట రెండూ ఒకేరకంగా, ఏకంగా ఉన్నాయా? ఈ రెండూ ఐకమత్యంగా ఉన్నాయా? మీ నోటికీ మనస్సుకీ ఇంత దూరం ఉంటే, మీకూ దేవుడికీ ఎంత దూరం ఉంటుంది! మీ నోటికీ మీ మనస్సుకీ ఇంత దూరాన్ని మీరు పెట్టుకొంటుంటే, దేవుడికీ మీకు ఎంత దూరం అవుతుంది? మనం చేసే పూజలు మనలో ఉన్న దోషాలను కడుక్కోవటానికి ఉపయోగపడకపోతే ఎందుకు ఈ పూజలు, ఎవరికోసం? నేను పూజ చెయ్యొద్దు అనటంలేదు, మీరు చేసే పూజ మీలో ఉన్న దోషాలని కడుక్కోవటానికి ఉపయోగపడకపోతే, ఆ పూజ యొక్క ప్రయోజనం ఏమిటి?

మీరు కొంతమంది కళ్ళు చూస్తూ ఉంటే ఆ కళ్ళలోంచి విషం బయటికి కారుతూ ఉంటుంది. వాడు ఈశ్వరుడు లేడని చెప్తే ఈశ్వరుడు లేనట్టేనా? హృదయమంతా రాగద్వేషాలతో నింపుకొని, ఆ రాగద్వేషాలను వాడు ఖాళీ చెయ్యలేక, ఈశ్వరుడు లేడని చెపితే, ఈశ్వరుడు లేనట్టేనా? హృదయంలో ఉన్న రాగద్వేషాలని తొలగించుకోలేక, వాడికి ఈశ్వరుడి యొక్క అస్తిత్వం తెలియకపోతే, వాడు నోటితోటి ఈశ్వరుడు లేడని చెపితే నిజంగా ఉన్న ఈశ్వరుడు లేనట్టేనా? మీరు చేసే శ్రమలు, మీరు చేసే కృషి, ఈ లోక జీవితాన్ని సంతోషపరచటం కోసం, లౌకికంగా అభివృద్ధిలోనికి రావడం కోసం, ఈ లోకానికి సంబంధించిన గౌరవాల కోసం మీరు చేస్తున్నారే కానీ కనీసం ఒక చిన్న పనైనా మీరు ఈశ్వరుడికోసం చేసారా? ఒక మాటని ఈశ్వరుడికి సమర్పించారా? ఒక చిన్న పనిని

ఈశ్వరుడికి సమర్పించారా? ఈ లోకాన్ని మరచిపోయి, మీ దేహాన్ని మరచిపోయి, మీ బంధువులని మరచిపోయి, మీ చుట్టాలని మరచిపోయి, మీ స్నేహితులని మరచిపోయి, మీ ఇల్లు మరచిపోయి, ఒక చిన్న పని అయినా మీరు జీవితంలో ఈశ్వరుడికోసం చేసారా?

నేను పిచ్చివాడినని ఈ కలకత్తా మహానగరమంతా నా గురించి చెప్పకుంటోంది అని రామకృష్ణుడు ఒకసారి అన్నారు. ఆయన ఎదురుగుండా వచ్చి చెప్పేవారట కొంతమంది, మీరు పిచ్చివాడని ఊళ్ళో చెప్పకుంటున్నారని. నిజమే వాళ్ళు చెప్పింది నిజమే, నేను పిచ్చివాడినే, నాగురించి చెప్పకునే వాళ్ళందరూ కూడా పిచ్చివాళ్ళే. నేను కూడా వాళ్ళతో పాటు పిచ్చివాడినే. వాళ్ళకి కీర్తి పిచ్చి, అధికారాల పిచ్చి, రూపాయల పిచ్చి, నాకు దేవుడి పిచ్చి. అందరూ పిచ్చివాళ్ళమే. ఈ లోకమంతా పిచ్చి ఆసుపత్రే. అందులో నేనూ ఒక పిచ్చివాడిని, కానీ పిచ్చిలో తేడా ఉంది. కొంతమందికి అధికారాల పిచ్చి. కొంతమందికి పదవుల పిచ్చి, కొంతమందికి రూపాయల పిచ్చి, కొంతమందికి గౌరవాల పిచ్చి. అలాగే అందరితో పాటూ నేనూ పిచ్చివాడిని, నాకు దేవుడి పిచ్చి అన్నాడు రామకృష్ణుడు. భగవంతుడు ఇప్పడు మీ హృదయంలో సజీవంగా ఉన్నాడు. మీ కోసం ఎదురు చూస్తున్నాడు ఎప్పడు మిమ్మల్ని తీసుకుందామా లోపలికి అని క్షణం క్షణం ఎదురుచూస్తున్నాడు. పొరుగూరి నుంచి ఉత్తరం రాసి, మీ చుట్టం ఎవడో ఈ రోజు వస్తానని చెపుతాడనుకోండి, ఆ చుట్టం కోసం మీరు ఎలా ఎదురుచూస్తారో అంతకంటే కోటి రెట్లు ఎక్కువగా మీ కోసం ఆతృత పడతాడు. మీ హృదయంలో ఉండి మీ కోసం ఎదురు చూస్తున్నాడు, ఈ జీవుడిని ఎప్పడు రక్షిద్దాం అని! అసలు మీరు ముఖం అటు తిప్పితే కదా! మీ ముఖం ఎప్పడైనా కనీసం తిప్పారా ఈశ్వరుడి వైపు! వెయ్యి కళ్ళతోటి మీ కోసం కనిపెట్టుకొని ఉన్నాడు ఈశ్వరుడు.

సంస్కృతం మాట్లాడినా ఒకటే, ఇంగ్లీషు మాట్లాడినా ఒకటే, హిందీ మాట్లాడినా ఒకటే, తెలుగు మాట్లాడినా ఒకటే, హృదయంలో ప్రేమ లేనప్పడు ఏ భాష మాట్లాడినా ఒకటే. హృదయంలో ప్రేమ లేనప్పడు ఏ భాష మాట్లాడితే ఏముంది? ఏ బట్ట తొడిగితే ఏముంది? ఏ కులం అయితే ఏముంది? ఏ జాతి అయితే ఏముంది? ఏ దేశం అయితే ఏముంది? మీరు రాజులా? బ్రాహ్మణులా? ఎవరైతే ఏముంది హృదయంలో మీకు ప్రేమ లేనప్పడు? నాకు పేరు మారుస్తానని డాక్టర్‌గారు అన్నప్పడు ఒక మాట జ్ఞాపకం వచ్చింది "కృష్ణా జిల్లా గుడివాడలో ఒకతను ఉండేవాడు. అతను భగవాన్ దగ్గరకి వెళ్ళాడు. ఎప్పడో 1920లలో మాట, కొత్తగా 1922, 1923 రమణాశ్రమం ప్రారంభమయ్యే రోజులవి; ఆ రోజులలో వెళ్ళాడు. ఆ రోజులలో ఇంటర్మీడియట్ ఏదో చదివాడు. ఇంటి దగ్గర పెళ్ళిచేసుకోమని బలవంతపెడితే, పెళ్ళి చేసుకోవటం ఇష్టంలేక అక్కడినుంచి పారిపోయాడు. బెజవాడ రైల్వే ప్లాట్‌ఫాంమీద రెండు రోజులు ఉండి, అలా తిరుపతి, మలయాళ స్వామి

దగ్గరకి వెళ్లి అలా అలా తిరిగి తిరువణ్ణామలై వచ్చాడు. మలయాళ స్వామి ఆశ్రమంలో ఎవరో ఇతనికి ఆనంద్ అని పేరు పెట్టారు. ఇంటిదగ్గర తెలిసింది ఈయన రమణాశ్రమంలో ఉన్నాడని. అతని పేరు సత్యం, ఆ పేరుతో ఉత్తరం వచ్చింది. మలయాళ స్వామి ఆశ్రమంలో ఆనంద్ అని పేరు పెట్టారు కదా, రమణాశ్రమంలో ఆ పేరుతో పిలుస్తున్నారు. భగవాన్ ఆ ఉత్తరం చేతిలో పుచ్చుకొని సత్యం అని ఉత్తరం వచ్చింది, మనకెవరూ సత్యం కనబడటం లేదే అన్నారు. సత్యమే వాడు, వాడి పేరు మారిపోయింది. తల్లితండ్రులకు తెలియదు పేరు మారిపోయినట్టు, వాళ్ళు పెట్టిన పేరు సత్యం. వీడికి సిగ్గేస్తోంది పాపం నేనే అని చెప్పటానికి. ఒక పక్కన భయం వేస్తోంది మనం ఇక్కడ ఉన్నట్లు ఇంటివద్ద తెలిసిపోయిందేమిటి అని అలా అందరి వంకా చూస్తున్నాడు. భగవాన్ ఏమీ తెలియనట్టు నటిస్తారు. ఎవరూ ఇక్కడ సత్యం అంటున్నారు, నువ్వే అని చెప్పకుండా? వాడిలో వాడు కంగారు పడుతున్నాడు. పది నిమిషాలు అలా ఉగ్గబెట్టుకున్నాడు తరువాత బరస్ట్ అయ్యాడు. నేనేనండీ సత్యం అన్నాడు. నువ్వు ఆనందువు కదా అంటే నేను మలయాళ స్వామి ఆశ్రమంలో పేరు మార్చేసుకున్నాను అన్నాడు. అప్పుడు భగవాన్ అన్నది ఎంత బాగుందో చూడండి “నీ తల్లితండ్రులు పెట్టిన సత్యం అనే పేరు కంటే ఈ పేరు నీకు బాగుందా?” ఎంత బ్యూటీఫుల్‌గా అన్నారో చూడండి. నువ్వు మధ్యలో కల్పించుకొన్న పేరు నీ తల్లితండ్రులు పెట్టిన సత్యం అనే పేరు కంటే, ఈ పేరు నీకు బాగుందా? అంతకంటే ఘనంగా ఉందా ఈ పేరు నీకు? ఈ పేర్లు వూరికే వ్యవహారానికి. సుబ్బమ్మ అనీ, ఎల్లమ్మ అనీ, పుల్లమ్మ అనీ, వెంకటరామరాజు అనీ, సుబ్బరాజు అనీ, ఈ పేర్లు వూరికే వ్యవహారానికి. స్వప్న జీవితానికి, జాగ్రత్తు జీవితానికి కొంచెం కూడా తేడా లేదు? రామారావుగారనీ, రామచంద్రరాజుగారనీ ఇంకొకరనీ, కేవలం వ్యవహారం నిలబడటం కోసం. ఇవన్నీ వ్యవహార నామాలు. నిజమైన నామం మన ఆత్మే. ఈ పేర్లన్నీ వ్యవహారం కోసం పెట్టబడ్డాయి. ఏదో ఒక రూపం వచ్చింది, రూపం వచ్చిన తరువాత పేరు పెట్టాలి. మనకో రూపం పేరు కానీ నిజంగా మనం రూప రహితులం, నామ రహితులం. మనకి రూపం వచ్చినంత మాత్రంచేత మనం రూపం కాదు, మనం రూపరహితులం. మనకో పేరు ఉండొచ్చు, కానీ ఆ పేరు మనం కాదు. మనం నామ రహితులం. మీకూ ఎంతోకొంత కీర్తి ఉండొచ్చు. ఆ కీర్తి మీరు అనుకోవద్దు, మీరు కీర్తి రహితులు, మీరు ఆత్మ. మీరు కీర్తి కాదు, మీరు రూపం కాదు, మీరు పేరు కాదు, మీరు ఆత్మ. ఒకవేళ మీ పేరుతోటి, మీ రూపంతోటి, మీ కీర్తితోటి మీరు కలిస్తే వీటిలోంచి బయటపడటం కోసం లక్షలాది సంవత్సరాలు, వేలాది జన్మలు మీరు సాధన చెయ్యాలి. అది మరచిపోకండి. ఒకవేళ మీ పేరుతోటి, రూపంతోటి, కీర్తితోటి మీరు కలుస్తారనుకోండి, మళ్ళీ వీటిలోంచి విడిపోవటం కోసం వేలాది జన్మలు ఖర్చు పెట్టాలి. ఒకటి మటుకు మీరు మర్చిపోకండి నెపాలన్నీ దేవుడి

మీద గెంటకండి, గురువు మీద గెంటకండి. ఈ రోజున ఈ స్థితిలో మనం ఉండటానికి కారణం మనం చేసిన కర్మే కానీ, దేవుడు కాదండీ. మనకి దుఃఖం వస్తూ ఉంటే మనం చేసిన కర్మ వల్ల మనకి దుఃఖం వస్తోంది. మంచి చేసిన వాడికి మంచి ఎదురు వస్తుంది, చెడ్డ చేసినవాడికి చెడ్డ ఎదురు వస్తుంది. ఎదురు వచ్చేవరకు వాడికి తెలియదు ఏది ఎదురువస్తుందో. ఇందులో దేవుడికి నిమిత్తం లేదు.

కొంతమంది మాకు సుఖాలుగా ఉన్నాయి, లేకపోతే మాకు కష్టాలుగా ఉన్నాయి అంటారు. మీ సుఖాలు మీ అహంకారానికే, మీ కష్టాలు మీ అహంకారానికే, ఆత్మకి ఎట్టి సంబంధం లేదు. మీ సుఖాలు కరిగిపోతాయి, మీ కష్టాలు కూడా కరిగిపోతాయి. ఇదంతా స్వప్నం. మీ మనస్సుని మీ అహంకారాన్ని అలంకరించుకోకండి. లోకం గొడవలతోటి ఈ సృష్టితోటి మీ అహంకారాన్ని అలంకరించుకుంటే మీరు దేవుడికి దూరం అవుతారు. మీకు బయట కోట్లు ఉండవచ్చు, ఇంట్లో కోట్లు ఉండవచ్చు, ఉండనివ్వండి కానీ హృదయంలో పేదతనంగా ఉండాలి, వాడిని ఈశ్వరుడు కరుణిస్తాడు. మళ్ళీ ఈ మాట మీరెవరికీ చెప్పకండి. మోస్ట్ సీక్రెట్ అండ్ మోస్ట్ సేక్రేడ్. మీకు బయట సామ్రాజ్యాలు ఉండవచ్చు కానీ మీ హృదయంలో మీరు నిజంగా పేదవాళ్ళు అయితే మిమ్మల్ని అనుగ్రహిస్తాడు ఈశ్వరుడు. మనం ఈ పీనుగలని అలంకరించుకొని ఎంతో గర్వం తెచ్చుకొంటున్నాము. పీనుగలు అంటే ఎక్కడినుంచి వస్తాయి - మన శరీరాలే పీనుగలు. వీటిని అలంకరించుకొని గర్వం తెచ్చుకొంటున్నాము. దీన్ని ఎంత అలంకరించినప్పటికీ ఇది స్మశానంలో కాలిపోతుంది, గర్వం మటుకు మన కూడా వస్తుంది.

సోదర మహాశయులారా! కూడా వచ్చే మనస్సుని బాగుచేసుకోవటం మానేసి, స్మశానంలో కాలిపోయే శరీరానికి ఎన్ని కోట్లు ఖర్చుపెడుతున్నాం ఎన్ని హాస్పిటల్స్‌లో పెడుతున్నాం! జన్మజన్మలకీ మన కూడా వచ్చే మన మైండ్‌ని ప్యూరిఫై చేసుకోవటం మానేసి, స్మశానంలో కాలిపోయే, కాలిస్తే బూడిదయ్యే, కప్పెడితే మన్ను అయ్యే ఈ శరీరాలకోసం ఎన్ని కోట్లు ఖర్చు పెడుతున్నాము? ఎన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నాము? ఈ శరీరాల కోసం మన కూడా వచ్చే మనస్సు కంటే, తాత్కాలికంగా ఉండే ఈ శరీరం గొప్పదా? మీరు ఒక ఇంటిలో నుంచి ఇంకొక ఇంట్లోకి మారినప్పుడు, ముందు మీ ఇంటిలో ఉన్న బంగారం కూడా పట్టుకెళతారా, లేకపోతే తాటాకు బుట్టలు ముందు పట్టుకెళతారా? ఇది కామన్‌సెన్స్. దీనికి మతంతోటి సంబంధం లేదే, దేవుడితో సంబంధం లేదే, మీ గురువు ఎవరో సంబంధం లేదే! మీ శరీరాన్ని మీరు చాలా జాగ్రత్తగా ఉంచుకోండి. నేను కాదనటం లేదు. ఆరోగ్యాన్ని భాగ్యం అనలేదు, మహాభాగ్యం అన్నారు. అంటే భాగ్యాలలో కెల్లా గొప్ప భాగ్యం, గ్రేటెస్ట్ అసెట్! మంచిదే, మీ శరీరాన్ని ఉంచుకోండి. కానీ ఆరోగ్యం ఎంత భాగ్యం అయినప్పటికీ శరీరాన్ని ఎంత

జాగ్రత్తగా చూసినప్పటికీ ఇది కాలిపోయేదే కదా! ఇది పీనుగు కదా! కూడా రాదు కదా! పోనీ ఈ చేతులు వస్తాయా? ఈ కాళ్ళు వస్తాయా? ఈ పొట్ట వస్తుందా? ఈ తలకాయ వస్తుందా మన కూడా? మన కళ్ళ ఎదురుగా బూడిద అయిపోయి మాడిపోతుంది కదా! మరి కాలిపోయే, కూడా రాని ఈ శరీరానికి ఇంత జాగ్రత్త పడుతూవుంటే, కూడా వచ్చే మనస్సు కోసం మనం తీసుకొనే జాగ్రత్త ఏమిటి? దీనికి మీ మతాలతోటి సంబంధం ఏముంది? మీరు పురుషులా స్త్రీలా దీనికి సంబంధం ఏముంది? పురుషులకి అక్కరలేదా, స్త్రీలే కానీ పురుషులు మనస్సు విషయంలో జాగ్రత్త పడనక్కరలేదా? స్త్రీల శరీరాలు ఎలా కాలిపోతున్నాయో పురుషుల శరీరాలు అలా కాలిపోవటం లేదా? స్త్రీలకి వాళ్ళ మనస్సు ఎలా కూడా వస్తుందో, పురుషులకి కూడా వాళ్ళ మనస్సు అలాగే కూడా వస్తుంది కదా! వాళ్ళ మనస్సుని వాళ్ళు బాగుచేసుకోనక్కరలేదా? ఈ మతాలు, ఈ సత్సంగాలు, ఈ కేంద్రాలు, కేవలం స్త్రీలకే పరిమితమా? ఎప్పుడూ శాశ్వతంగా ఉండే దానిని మీరు బాగుచేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారా? నాలుగు రోజులు ఉండి ఊడిపోయే దానికి పడిపోయే దానికి ప్రయత్నం చేస్తారా? మీరు ఆలోచించండి. ఇందులో మతంతోటి సంబంధం ఏముంది? మీరు బాగుపడటానికి మతంతో సంబంధం ఏముంది? మీకు భయం వేస్తోందా? భయం వేస్తోంటే రెండు వస్తువులు ఉండాలి. మీరు ఆత్మ కదా, ఆత్మ ఒకటి కదా, మరి ఎవరిని చూస్తే మీకు భయం? కొంతమంది వాళ్ళ అహంకారాన్ని ప్రదర్శించుకోవటం కోసమే జీవిస్తుంటారు. వాళ్ళ అహంకారానికి మనం మేత పెడుతూ ఉండాలి. వాళ్ళ అహంకారానికి మేత పెడితేనే కానీ వాళ్ళు మనకి చేసే ఉపకారం కూడా చెయ్యరు.

మీరు తిన్నది అరగక కక్కు వచ్చిందనుకోండి, బయటికి కక్కేసాక, ఆ కక్కేసింది ఏమైంది అని మీరెవరైనా ఆలోచిస్తారా? ఆలోచించరు కదా! అదేవిధంగా మీ మనస్సుని మీరు వదిలేస్తే ఇంక దాని గురించి ఏంటి ఆలోచించేది? భగవాన్ అన్నారు అహంకారం ఉంటే అంతా ఉంది, అహంకారం లేకపోతే ఏదీ లేదు. మీలోంచి వచ్చిన కక్కుని వదిలేసినట్టు అహంకారాన్ని వదిలేసామనుకోండి, వదిలేసిన తరువాత ఆ కక్కు ఏమైంది అన్న ఆలోచన మీకు ఎలా ఉండదో అదే విధంగా మీరు నిజంగా అహంకారాన్ని వదిలేస్తే దాని గురించి కూడా మీకు ఆలోచన ఉండదు. నన్ను క్షమించండి కక్కుతోటి పోల్చినందుకు అహంకారాన్ని. ఎందుకూ పనికిరాని వస్తువు ఈ లోకంలో ఏదైనా ఉంటే అది అహంకారమే. ఇంకా కక్కు మెరుగు అది ఏ కాకులో కుక్కలో తినటానికి పనికి వస్తుంది. ఎందుకూ పనికిరానిది ఏదైనా మన హృదయంలో ఉంటే అది అహంకారమే. అది ఎందుకూ పనికిరాదు, మనకి పనికిరాదు, ఎదుటివాళ్ళకి పనికిరాదు. కానీ నిరంతరం దాని కోసమే మనం జీవిస్తున్నాము. ఇదే మాయ. మన శరీరంలో పనికి రానిది ఏదైనా ఉంటే అది అహంకారం. దానికోసమే

మనం జీవిస్తున్నాం. మాయ అంటే ఇది కాదా! నా మాయను ఎవరూ జయించలేరు అని భగవంతుడు భగవద్గీతలో చెప్పాడు. ఎందుచేతనంటే ఎందుకూ పనికిరాని అహంకారాన్ని ఇక్కడే పెట్టాడు. దానికోసమే మనం జీవిస్తున్నాము, దాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యటంలేదు. మీరు నాకు దండ వేసారనుకోండి, నేను ఇలా ఉబ్బిపోతున్నాను. ఎవరికీ ఉబ్బ, నా అహంకారం ఉబ్బిపోతోంది. ఇప్పుడు నేను ఎందుకు చెపుతున్నాను అనుకొంటున్నారు ప్రతి ఆదివారం? నా అహంకారాన్ని పెంచుకోవటం కోసం! అహంకారమే సంసారం, అహంకారమే మనస్సు, అహంకారమే జీవుడు. అహంకారమే దుఃఖం, అహంకారమే నరకం. చంటిపిల్లలప్పుడు ఈ అహంకారం తల్లిని పట్టుకొంటుంది, అమ్మా అమ్మా అమ్మా అని ఏడుస్తూ ఉంటుంది. అంతకంటే కొంచెం పెద్ద పిల్లలప్పుడు అహంకారం లక్కపిడతలని పట్టుకొంటుంది. అంతకంటే వయస్సు వచ్చాక ఏ భార్యనో పట్టుకొంటుంది. అంతకంటే పెద్ద వయస్సు వచ్చాక పిల్లలనో, మనవలనో పట్టుకొంటుంది. చచ్చిపోయేటప్పుడు కొంతమంది వాళ్ళని చూడాలని ఉంది, వీళ్ళని చూడాలని ఉంది అంటూ ఉంటారు. అహంకారం ఏదో రూపాన్ని పట్టుకొంటుంది. అహంకారానికి ఆహారం ఏమిటంటే రూపమే. ఈ శరీరానికి వరి అన్నమో, గోధుమ అన్నమో ఉండాలి. అహంకారానికి అవి అక్కరలేదు, దానికి రూపమే. ఏదో ఒక రూపాన్ని అలా చూస్తూ ఉంటుంది. దానిని పట్టుకొంటుంది. పెళ్ళామో, లేకపోతే తల్లి తండ్రో, లేకపోతే అధికారమో, ఏదో ఒకటి, చచ్చేవరకు మొత్తానికి దానికి ఏదో ఒక ఆకారం ఉండాలి. రూపం లేకపోతే అహంకారం ఉండలేదు. అందుచేత చచ్చిపోయినప్పుడు కూడా నాకు అది చూడాలని ఉందని ఇది చూడాలని ఉందని, అది తినాలని ఉందని ఇది తినాలని ఉందని, అంటూ ఏదో ఒక రూపం మీదకి పోతూ ఉంటుంది. ఎందుచేతనంటే ఈ అహంకారం రూపం లేకుండా ఉండలేదు.

పోనీ ఇంత ఏడిపిస్తోంది కదా ఈ అహంకారం; ఈ దుఃఖానికి అంతా అహంకారమే కారణం కదా, పోనీ దానిని ఆపరేషన్ చేసి బయటికి తొలగించేసుకొందామంటే దానికి రూపం లేదు. అది రూపాలని పట్టుకొంటుంది దానికి రూపం లేదు; అదీ ఇక్కడ గమ్మత్తు. అందుచేత దీనిని ఎవడూ జయించలేకపోతున్నాడు. అది రూపాలని పట్టుకొంటుంది కాబట్టి దానికీ రూపం ఉంటే, దానిని తెలుసుకోవచ్చు. ఏ ఫొటోనో తీయించుకొని దానిని లాక్కోవచ్చు. అక్కడిదాకా ఎందుకు బ్రెయిన్‌లోంచి హార్ట్‌లోకి అమృతనాడి అని ఒక నాడి ఉంటుంది. అది కూడా మీరు ఫొటో తీయించుకుంటే కనబడదు. కానీ ఉన్న మాట నిజం. అది మేల్కొంటేనే కానీ అసలు ఇది మాయ అన్న సంగతి మీకు తెలియదు. మీరు హాస్పిటల్‌కి వెళ్ళి డాక్టరుచేత ఫొటో తీయించుకుంటే తెలియదు. సరిగ్గా ఇది బ్రెయిన్‌లోంచి హార్ట్‌లోకి ఉంటుంది. సంస్కారాలు వాసనలు సూక్ష్మరూపంలో హార్ట్‌లో ఉంటాయి. స్థూల రూపంలో

బ్రెయిన్‌లోకి వస్తాయి. మరణించే టైములో మటుకు ఇక్కడున్న సంస్కారాలన్నీ ఒకటి తరువాత ఒకటి వచ్చి పైకి చేరతాయి. మరణించే టైములో బ్రెయిన్‌లోకి వస్తాయి. అంటే బ్రెయిన్ తెరలాగా ఉంటుంది, లోపల ఇది ప్రొజెక్టర్, ఇంజను అన్నమాట హార్ట్.

మీరెవరూ చచ్చిపోతాము అని కంగారు పడకండి. ప్రారబ్ధం ఖర్చు అవ్వకుండా ఎవరూ చావరు. ఇక్కడున్న వాళ్ళకెవరికైనా తలకాయ పోటుగా కాళ్ళు నెప్పలుగా ఉంటే చచ్చిపోతాం అని కంగారు పడకండి. ఆ ప్రారబ్ధం ఖర్చు అయితేనే కానీ కాన్సర్ వచ్చినవాడు కూడా చావడు. ఈ శరీరం ఎందుకు వచ్చిందో, ఏ ప్రారబ్ధం కోసం ఈ శరీరం వచ్చిందో ఆ ప్రారబ్ధం ఖర్చు అయ్యేవరకు, ఆ సెకను వరకూ ఈ శరీరం పడదు. శ్వాస పోతున్నప్పడు కూడా భగవంతుడి మీద ఎవడికైతే విశ్వాసం పోదో వాడు భక్తుడు. శ్వాస పోతున్నప్పడు అమ్మబాబోయ్ అయ్యబాబోయ్ ఏదో అంటాము మనం. సరిగ్గా ప్రాణం పోయేటప్పడు వెర్రికేకలు వెయ్యటమో, ఏదో భయం వస్తుంది మనకి. ఈ శ్వాస పోతున్నప్పడు కూడా, ఈ శరీరంలోంచి తను విడిపోతున్నప్పడు కూడా, 60 ఏళ్ళు 70 ఏళ్ళు కాపురం ఉన్న ఈ శరీరంలోంచి విడిపోతున్నప్పడు కూడా, ఈ శ్వాస పోతున్నప్పడు కూడా, అణుమాత్రం కూడా భగవంతుడి మీద విశ్వాసం ఎవడికైతే చలించదో వాడే భక్తుడు. ఏవండీ జీవుడు ఎలా ఉంటాడండీ అని మీరు అడుగవచ్చు. ఈ దేహమాత్రుడిని నేను అనుకునే వాళ్ళంతా జీవులే. మీరు అడుగవచ్చు జీవుడు జీవుడు అంటారు కదా ఎలా ఉంటాడు అని? మీరందరూ ఈ దేహం నేను అనుకొంటున్నారు కదా! ఈ దేహమాత్రులము మేము అనుకొంటున్నారు కదా! మీరందరూ జీవులు. ఇటువంటి విషయాలు తెలుసుకోవటానికి మీరు కోర్టుకి వెళ్ళొద్దు ఎందుకంటే డబ్బులు వేస్ట్. ఎన్ని సుఖాలు కావాలంటే, ఎన్ని భోగాలు కావాలంటే అన్నీ ఉన్నాయి వాళ్ళకి. డబ్బుంది, ఇంద్రియాలకి ఎన్ని భోగాలు కావాలంటే అన్ని భోగాలు ఉన్నాయి, కానీ మాకు శాంతి లేదు అంటున్నారు. డబ్బు వల్ల భోగం వస్తుంది, డబ్బు వల్ల శాంతి రాదు.

మీలో సీక్రెట్ బర్డెన్స్ ఉన్నంతకాలం, వరల్డ్‌లీ కేర్స్ ఉన్నంతకాలం మీకు ఫియర్ తప్పదు. అంటే కొన్ని భారాలు ఉంటాయి మీ హృదయంలో. మీరు ఎదుటి వాళ్ళతోటి చెప్పకోలేని భారాలు సంకెళ్ళు బరువులు ఉంటాయి మీ హృదయంలో. మీ ఇంటిలో మీరు చెప్పకోలేరు, వీధిలో చెప్పకోలేరు, మీ బంధువుల తోటి చెప్పకోలేరు, మీ స్నేహితులతోటి చెప్పకోలేరు. ఎవరితోటి చెప్పకోలేక మీరలాగే మగ్గిపోతూ ఉంటారు. కొంతమంది స్నేహితులతోటి షేర్ చేసుకొంటారు. స్నేహితులతోటి కూడా షేర్ చేసుకోలేని బరువులు బాధ్యతలు, కష్టాలు నష్టాలు, దుఃఖాలు, మీ హృదయంలో ఉంటాయి. అవి మిమ్మల్ని కృంగతీసేస్తుంటాయి, ఎక్స్‌ప్రెస్ చేసుకోలేరు. అవి ఉన్నంతకాలం జ్ఞాని కాలేరు. మీ హృదయంలో ఏవో సంకెళ్ళు ఉంటాయి, ఏవో బరువులు ఉంటాయి, బాధ్యతలు ఉంటాయి. ఎవరితోనైనా చెప్పకుందాము

అంటే మీ దుఃఖాన్ని వాళ్ళు పంచుకోరు. మీ మీద నాలుగు రాళ్ళు వేసేవాళ్ళే కానీ మీ దుఃఖాన్ని ఎవరు పంచుకొంటారు అమ్మా! మీ దుఃఖం ఎవరితోనైనా చెప్పకొంటే మిమ్మల్ని ఎగతాళి చేస్తారు, మిమ్మల్ని హేళన చేస్తారు, అవసరమైతే నెత్తిమీద నాలుగు రాళ్ళు వేస్తారు కానీ మీ దుఃఖాన్ని ఎవరు పంచుకొంటారు? మీ సుఖాన్ని మీ ధనాన్ని పంచుకొనేవాళ్ళు ఉన్నారు కానీ మీ దుఃఖాన్ని పంచుకొనేవాళ్ళు ఎవరైనా ఉన్నారా, మీ ఇంటిలో కానీ, వీధిలో కానీ, దేశంలో కానీ? మీ సుఖాన్ని మీ ధనాన్ని షేర్ చేసుకొనేవాళ్ళు ఉన్నారు కానీ, మీ దుఃఖాన్ని పంచుకునే వాళ్ళు మీ ఇంటిలో ఉన్నారా? మీ ఇంటి పక్కన ఉన్నారా? ఎవడికైతే హృదయంలో భారాలు ఉంటాయో, ఆ భారాలన్నీ ఏదో జన్మలో ఏదో రోజులో ఏదో లోకంలో బయటికి రావాలి. అప్పటివరకూ వాడు జ్ఞాని కాలేడు.

సోదర మహాశయులారా! మీరు ఈశ్వరుడిని ఈశ్వరుడి కోసమే ప్రార్థించండి. లోక ప్రయోజనాల కోసం మీరు ఎదురు చూడకండి, వాటంతట అవే వస్తాయి. ఏది ఎప్పుడు జరగాలో అది జరుగుతూనే ఉంటుంది. అది ఈశ్వరుడికి తెలుసు. మనం 40 సంవత్సరాల క్రిందో 50 సంవత్సరాల క్రిందో ఈ దేశంలోకి వచ్చాము. మళ్ళీ 20 సంవత్సరాలకో 30 సంవత్సరాల తరువాతో ఈ దేశాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోతాము. కొంతకాలం కిందట వచ్చాము మళ్ళీ కొంత కాలానికి ఈ దేశాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోతాము, ఈ దేశం అంతా ఏమైపోతుందని ఈ పదేళ్ళలో మనకి ఆలోచన. మనం పుట్టక ముందు ఈ దేశాన్ని ఎవరు చూసారు? మనం చచ్చిపోయాక ఎవరు చూస్తారు? చూసేవాళ్ళు లేరా? మనం పుట్టక ముందు మనమే చూసామా ఈ దేశాన్ని. మనం చచ్చిపోయిన తరువాత ఈ దేశాన్ని చూసేవాళ్ళు లేరా? ఇదంతా అహంకారం కాదా? అహంకారం లోంచి వచ్చే ప్రశ్నలు కాదా ఇవన్నీ? అందుచేత ఇదొకటి చివరి మాటగా చెప్తున్నాను ఈ రోజున కార్యక్రమంలో ఈ మధ్యన ఒక పెద్ద మనిషి ఇంకో పెద్ద మనిషిని అడిగాడంట "మీరెవరు?" అని. మీరెవరని అడిగితే, మనమైతే మేం రాజులమనో, బ్రాహ్మణులమనో, కాపులమనో ఏదో చెపుతాము. ప్రశ్న ఎంత బాగుందో చూడండి, మీరెవరు అని ప్రశ్న. అప్పుడు ఆ ప్రక్కవాడు అన్నాడంట. నేను ఎవడినో తెలుసుకోవటానికి ప్రయత్నంలో ఉన్నాను అని. ఎంత బాగుందో చూడండి. మేము రాజులమని, కోమటులమని చెప్పలేదు. మీరెవరని అడిగాడు ప్రక్కవాడు, ఆ ప్రశ్నని తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నానని చెప్పాడు. ఎంత అందంగా ఉందో చూడండి. హూ ఆర్ యూ అని అడిగాడండి వాడు, మనం సడన్‌గా రాజులమని చెపుతాం, లేకపోతే వైశ్యులమని చెపుతాం, లేకపోతే హరిజనులమని చెపుతాం. అతను అలా చెప్పలేదు. నేను ఎవడినో తెలుసుకొనే ప్రయత్నంలో ఉన్నాను. తెలియలేదు ఇంకా. ఆ ప్రయత్నంలోనే ఉన్నాను అన్నాడు.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

## అర్హత

సకల ఆధ్యాత్మిక సాధనల లక్ష్యం మనోనాశనం ద్వారా సాధకుడు స్వరూప సచ్చిదానంద స్థితిని 'తాను'గా 'నేను'గా అనుభవైకవేద్యం చేసుకోవాలి. పెద్దగా చదువుకోని అతి సామాన్యవ్యక్తి ఒకరు, భగవాన్ శ్రీరమణమహర్షి వద్దకు వచ్చి, అయ్యా! నేను జ్ఞాన మార్గంలో పయనించడానికి అనగా నేను ఎవరో? తెలుసుకోవడానికి 'నేను అర్హుడనేనా?' అని ప్రశ్నించాడు. అప్పడు భగవాన్ 'నీవు జీవించియున్నావా?' అని తిరిగి ప్రశ్నించారు. అప్పడు ఆ వ్యక్తి 'నేను జీవించి ఉన్నాను' అని బదులిచ్చాడు. అప్పడు భగవాన్ అయితే 'నీవు అర్హుడవే'! అని అన్నారు. మానవ దేహం ధరించిన ప్రతి ఒక్కరు, అమృతానుభవం పొందడానికి సమానమైన అర్హత కలిగినవారే! భగవాన్ చెప్పినట్లు వ్యక్తి జీవించి ఉంటే చాలు. నాలో అనేక లోపాలు, అడ్డంకులు ఉన్నాయి, మరి నేను ఆధ్యాత్మిక మార్గంలో పయనించగలనా? అని భావిస్తాం. లోపాలు, ఆటంకాలు అను తలంపులే గొప్ప ఆటంకాలు. బ్రహ్మము అఖండముగా, స్వరూపముగా, అంతర్యామిగా, అందరిలోనూ సమానముగా, ఉంది కాబట్టి వాస్తవంగా 'తాను' ఎవరో? తెలుసుకొనుటకు సమానముగా అర్హులే! ఆత్మజ్ఞానం శాశ్వతమైన సుఖము, శాంతిని, అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది. పరమాత్మ అందరిలోనూ అంతర్యామిగా ఉండి, జీవులను వారి వారి ప్రారబ్దానుసారం ఆడిస్తూ ఉంటాడు. కాబట్టి భూత దయ కలిగి యుండి, సకల ప్రాణికోటిని తనవలె చూసుకోవాలి. సాటివారిలోని లోపాలను వెదకకుండా, వారిని విమర్శించకుండా, తనలోని లోపాలను సరిదిద్దుకుంటూ, మనస్సును అంతర్ముఖం చేసే అభ్యాసం చేస్తే, గుర్వనుగ్రహం తోడై, మన నిజ స్థితిలోకిటటటట మేల్కొనగలము. కేవలము భౌతికమైన పురోభివృద్ధి, ఎదుగుదల మాత్రమే సరిపోదు, ఆధ్యాత్మికంగా ఎదగాలి. 'నేను' - 'నాది' అనే పరిధిని దాటాలి. సకల బంధములనుండి విముక్తిని కలిగించి, ఆత్మజ్ఞానం ద్వారా అమరత్వాన్ని ప్రసాదించే గుర్వనుగ్రహాన్ని మించిన శక్తి ఈ లోకంలో లేనే లేదు. అట్టి గుర్వనుగ్రహం అనుభవైకవేద్యం కావాలంటే నిరంతర సాధన, తపన, చిత్తశుద్ధి, మున్నగు వాటితోపాటు గురుబోధను శ్రవణం చేస్తూ, మనన నిధి ధ్యాసల ద్వారా స్వరూప సచ్చిదానంద స్థితిలోకి మేల్కోవాలి.

**ఓం తత్ సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# నిన్నటి భారమే నేటి బాధకు కారణం

మనం మన పాపాలతోనే శిక్షించబడుతున్నాము. ఎవరి వల్లలో శిక్షించబడటం లేదు. జన్మించాము కనుక ఏదో ఒకటి మనకు సంక్రమిస్తుంది. ఏదో ఒకటి జరగకుండా ఎలా వుంటుంది? అలా జరిగిన దాన్ని గురించి కొంపలు మునిగిపోయేటట్లు దుఃఖిస్తే ఆ సమస్య పరిష్కారం కాదు. ఈ సృష్టిని పాలించే శాసనమును అనుసరించుకొని నేను ఈ బాధను అనుభవిస్తున్నాను దానికి ఏదో నిగూఢ రహస్యం ఉంది. అది నా ఆత్మ వికాసమునకు వినియోగించబడుతున్నది. అది భగవంతుడు ఇచ్చిన వరమే అవకాశమే అనే అవగాహనతో మన మానసిక స్వభావం మారిపోతుంది. ఎవరూ వృధాగా బాధపడకూడదు. బాధలు పడటమంటే ఆధ్యాత్మిక స్వేచ్ఛకు దారిచూపిస్తుంది. వర్తమానం అంటేనే కాలమే అదే వాస్తవం అదే అస్తిత్వం. వర్తమానం గతాన్ని పూజిస్తుంది, పాము కుబుసాన్ని వదిలేసినట్లు గతాన్ని వదిలేసి మనం నిండుగా సమగ్రంగా జీవించాలి. ఒకోసారి పాపం చేసిన వాడు సుఖపడుతున్నట్లు పుణ్యం చేసిన వాడు దుఃఖపడుతున్నట్లుగాను చూచి మోసపోకూడదు. పాపాలు ఎదురు తిరిగేవరకూ అలాగే ఉంటాయి దానికి కొంత కాలము పడుతుంది. బీజం నాటిన తరువాత ఫలాలు రావటానికి కొంతకాలం పడుపాపం రుచి చివరకు విషమే అని తేలిపోతుంది. పుణ్యం అమృతంలా మారిపోతుంది. జీవితాన్ని లోతుగా గమనించాలి. సంభోగం జరిగిన తొమ్మిది నెలలకు కాని బిడ్డపుట్టటంలేదు కదా అని అనుకోకు. పాపం ఎదురు తిరగటం ప్రకృతి ధర్మం దాన్ని అడ్డుకోలేము, పారిపోలేము. మనకు మంచి జరిగినా చెడు జరిగినా ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండాలి. చెడు జరిగినా ఏ ఒక్కరినీ నిందించకూడదు. కర్మసూత్రం మొత్తం నుంచి ఆ పని ఉద్భవించింది. ఆ పని అలా జరగటానికి అనుమతిస్తాము ఇక్కడ మనం బలిపశువులము. దాన్ని శంకరులు "అది విల్లు నుండి వదిలిపెట్టిన బాణం అది గమ్యాన్ని చేరుతుంది గాని మధ్యలో ఆపలేము" అన్నారు. బాధను మనం పరివర్తన చెయ్యగలగాలంటే ముందుగా దానికి సాక్షిగా తయ్యారై తీరాలి వైరుధ్యంగా అనిపించేవి నిజానికి అవి గత జన్మల కర్మలేనని మనకు స్వేచ్ఛలేదని దాన్ని కాదనకుండా ఉడికిపోకుండా దానిలో లీనమైపోకుండా ఉండాలి. దుఃఖం వస్తుంది, పోతుంది, ఆగిపోదు. మనం అద్దంలా ఉండాలి. అద్దానికి ఏ బాధ ఉండదు. ఎన్ని చిత్రాలు తనలో ప్రతిబింబించినా అలాగే మనం అందరి పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. భవిష ఊహల్లో ఉండి ఏడటమంటే రేపటిరోజును ఈరోజుల్లోకి తీసుకొని రావటం దాని వల్ల వర్తమానం 'మాయ'మౌతుంది. అది మత్తులా ఉంటుంది. అహంకారం గతం గాయాలద్వారా బ్రతుకుతుంది. అలా ఉంటే బ్రతుకు అంతా దుఃఖం అది లాభాలపైనే ఆధారపడి ఉంటుంది. శ్రీనాన్నగారు "గతానికి కాంక్రీటు గోడ కట్టండి" అంటారు. భగవంతుడికి ఉన్నది ఒక్కటే కాలం అదే వర్తమానకాలం. దరిద్రం అనుభవిస్తున్న వారు రోగాలతో ఉన్నవారు యోగం చెయ్యలేరు. కొందరికి అన్ని సుఖాలు ఉంటాయి కాని మానసికంగా కుళ్ళిపోతారు. జబ్బును వైద్యంతో నివారించవచ్చు. కుళ్ళిపోయేవారిని ఎవ్వరూ ఉద్ధరించలేరు. ఇది సత్యం.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966**